# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **హైదరాబాద్‌లోని శంషాబాద్ కన్హా శాంతి వనంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు పర్యటిస్తారు.**

2. **నరసాపూర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆంధ్రప్రదేశ్‌లోని నర్సాపూర్‌లో ఈరోజు ప్రారంభిస్తారు.**

3. **తెలంగాణలో జరిగిన పంచాయతీ ఎన్నికల రెండవ దశలో 84.28 శాతం ఓటింగ్ నమోదైందని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.**

4. **రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో నగదును ప్రభుత్వం చెల్లిస్తుందని ఆంధ్రప్రదేశ్ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.**

5. **ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరుడైన పొట్టి శ్రీరాములు వర్థంతి ఈరోజు.**

==========================

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని శంషాబాద్ కన్హా శాంతి వనంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని ఆరోగ్య, ధ్యానం కేంద్రాలతో సహా, యోగా కేంద్రాలను ముఖ్యమంత్రి తిలకిస్తారు. అలాగే వృక్ష సంరక్షణ, బయోచార్ కేంద్రం, పుల్లెల గోపీచంద్ స్టేడియంతో పాటు హార్టిఫుల్ నెస్ ఇంటర్నేషనల్ స్కూల్ ను సందర్శిస్తారు. అనంతరం శాంతి వనం అధ్యక్షులు కమలేష్ డి.పటేల్ దా తో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. సాయంత్రం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆత్మార్పణదినం కార్యక్రమానికి హాజరవుతారని అధికారులు తెలిపారు.

--------------------------

కేంద్ర పారిశ్రామిక, ఉక్కు శాఖల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఈరోజు మధ్యాహ్నం నరసాపూర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించనున్నారని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. కోనసీమ ప్రాంతం నుంచి ప్రయాణికులు ఎక్కువగా ఉండటంతో ఈ ప్రాంతానికి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ను పొడిగించినట్లు పేర్కొంది. ఈ రైలులో 7 ఏసీ చైర్ కార్లు, ఒక ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ ఉంటాయని, 530 మంది ప్రయాణించటానికి వీలుందని దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ హస్తకళలకు మరింత ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర శాసనసభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడు అన్నారు. కేంద్ర, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలోఅనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో జరిగిన కార్యక్రమంలో 50 మంది హస్త కళాకారులకు 5 లక్షల రూపాయల పనిముట్ల కిట్లను ఆయన నిన్న ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ,

వాయిస్.. 27 సెకన్లు

---------------------------

తెలంగాణలో జరిగిన పంచాయతీ ఎన్నికల రెండవ దశలో 84.28 శాతం ఓటింగ్ నమోదైందని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. మూడు వేల 911 సర్పంచ్ పదవులు, 29 వేల 913 వార్డు సభ్యుల స్థానాలకు మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించి, అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యధికంగా 91.72 శాతం పోలింగ్ జరగ్గా, నిజామాబాద్‌లో అత్యల్పంగా 76.71 శాతం ఓట్లు పోలయ్యాయి పలు గ్రామ పంచాయతీలలో సర్పంచ్ ఎన్నికల ఫలితాలు వెల్లడించారు. వెల్లడైన ఫలితాల మేరకు ఏకగ్రీవాలతో కలుపుకొని అధికార కాంగ్రెస్ పార్టీ అత్యధిక సర్పంచి స్థానాలను గెలవగా, తర్వాత స్థానంలో భారత రాష్ట్ర సమితి నిలిచింది. పూర్తి ఫలితాలు ఇంకా తెలియాల్సివుంది..మూడో దశ పోలింగ్ ఈ నెల 17వ తేదీన జరగనుంది.

---------------------------

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో నగదును ప్రభుత్వం చెల్లిస్తుందని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ప్రభుత్వ వైద్యులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం స్థానికంగా ధ్యానం కొనుగోలులో ఎదురవుతున్న సమస్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భవానీ దీక్ష విరమణలు ఈ రోజుతో ముగుస్తాయి. భవానీ దీక్షాధారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీక్షలు విరమిస్తున్నారు. చివరి రోజు కావడంతో భక్తుల రద్దీ పెరిగే అవకాశముందని దేవస్థానం అధికారులు తెలిపారు. జిల్లా యంత్రాంగం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని క్యూ లైన్లలో ఉచిత దర్శనం కల్పిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం గుండాలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, హెల్త్ సెంటర్, రైతు సేవా కేంద్రం, మునగపాడులో తారు రోడ్డును ఆయన నిన్న ప్రారంభించారు. గుంటూరులో శంకర్ విలాస్ ఫ్లైఓవర్ ను పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు

అందుబాటులోకి తెస్తామని కేంద్రమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 25 సెకన్లు.

---------------------------

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరుడైన పొట్టి శ్రీరాములు వర్ధంతి ఈరోజు. 1901 మార్చి 16న మద్రాసులో జన్మించిన ఆయన భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతులయ్యారు. 1930వ సంవత్సరంలో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. క్విట్ ఇండియా ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 1952 అక్టోబర్ 19న ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి... ఆ దీక్షలోనే 1952 డిసెంబర్ 15వ తేదీన కన్నుమూశారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం బలిదానం చేసిన మహనీయుడు పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో చలితీవ్రత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు రానున్న మూడురోజుల్లో 4 నుంచి 2 డిగ్రీలు తగ్గే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో కనిష్ఠ ఉష్ణోగ్రత 4.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

అలాగే తెలంగాణాలోని కొమరంభీం జిల్లాలో 8.9 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏజెన్సీ ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురుస్తుండడంతో ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

---------------------------

తెలంగాణలో ఖరీఫ్ వరి ధాన్యం సేకరణ లక్ష్యాన్నిపెంచాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి నిన్న లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 54 లక్షల టన్నుల్లో ఇప్పటికే 52 లక్షల టన్నులు సేకరించామని, ఇంకో రెండు రోజుల్లో నిర్దేశించిన లక్ష్యానికి చేరుకుంటామని తెలిపారు.

=====================